అమ్మాయి పెళ్ళి?

చంద్రశేఖర ఆజాద్

లొకేషన్ అంతా హడావుడిగా వుంది.

కొన్ని వందలమంది అక్కడ పనిచేస్తున్నారు. రెండు పెద్ద క్రేనులున్నాయి. కెమెరా మేన్ తన కార్యక్రమంలో వున్నాడు. నటీనటులు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వారికి ఎండ తగలకుండా రంగురంగుల గొడుగులు పాతేశారు.

మారంగా ఓ కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు దర్శకుడు నారాయణ్.

అటూ ఇటూ చూస్తున్న ఓ పాత్రికేయుడు సంతోషంగా ఆ వైపుకు నడిచాడు. ఆ పత్రిక తాలూకు ఫోటోగ్రాఫర్ దర్శకుడి ఆ భంగిమను తన కెమెరాలో బంధించాడు.

"ఎక్స్యూజ్ మి" అన్నాడు విలేఖరి.

"ఓ, మీరా రండి" అంటూ ఆహ్వానించాడు.

వారు కూర్చోవటానికి వేరే కుర్చీలు లేవు.

"అరే ఛైర్స్ లేవే" అని బాయ్‌ని పిలవటానికి అటూ ఇటూ చూస్తుంటే 'ఫర్వాలేదులెండి' అన్నాడతను.

"నో... నో .... మా పత్రికల వారితో డేంజరండి బాబు. రేపు కనీసం సీటయినా ఆఫర్ చేయలేదని రాస్తారు. నేనూ నిలబడుతున్నా" అంటూ నిలబడ్డాడు.

"భలేవారండి" అన్నాడు విలేఖరి నవ్వుతూ.

"చెప్పండి" అన్నాడు నారాయణ్.

"ఏం లేదు. ఈ రోజు మీతో ఇంటర్వ్యూ తీసుకోవాలనుకుంటున్నాను. మా పద్ధతి మీకు తెలుసు. మా పత్రిక కవర్ పేజి కవరేజికోసం ఈ ఇంటర్వ్యూ డిటెయిల్‌గానూ, వెరయిటీగానూ వుండాలని మా అభిలాష" అన్నాడతను.

"అవును. మీ పత్రిక ప్రత్యేకత నాకు తెలుసు" అన్నాడు నారాయణ్ ముక్తసరిగా.

"మొదలు పెడదామా."

"అలా నడుస్తూ మాట్లాడుకుందాం. మీకేం అభ్యంతరం లేదుగా. రొటీన్‌గా ఆ ఏర్పాట్లుకూడా చూసినట్లుంటుంది. ఏమంటారు" అన్నాడు నారాయణ్.

"యస్ సస్. ఇటీజ్ వెరీ నైస్" అన్నాడు విలేఖరి.

"ఇప్పుడు చిత్రీకరించే దృశ్యం ఏమిటి?"

"ఇది చివరి షెడ్యూల్. క్లైమాక్స్ దృశ్యాలు చిత్రీకరిస్తున్నాం."

"భారీగా వున్నట్లుందే."

"దాదాపు నాలుగు లక్షలదాకా ఖర్చవుతుంది. వేలాది జనంతోపాటు, వందలాది గుర్రాలు పాల్గొంటున్నాయి. రెండు కెమేరాలో చిత్రీకరిస్తున్నాం. మొత్తంమీద ఈ చిత్రం హాలివుడ్ చిత్రాల్ని మరిపింప

చేస్తుంది" అన్నాడు నారాయణ్.

"మీ రెక్కువగా క్రైమ్ చిత్రాలకు మాత్రమే దర్శకత్వం వహించటానికి కారణం ఏమిటి?"

"ముద్రండి బాబూ ముద్ర. ఈ ముద్రనుండి బయట పడాలని ఈ నడుమ రెండు సాంఘికాలు తీశాను. జనం ఛీకొట్టారు. అందుకే ఈ రకం చిత్రాలే తియ్యాలనుకుంటున్నాను. వీటికి మినిమమ్ గ్యారంటీ వుంది. ఓ వేళ 'ఏ' కేంద్రాల్లో ఫెయిలయినా 'బి' కేంద్రాల్లో బాగా వసూలు చేస్తాయి. ఈ రోజు జనానికి కావలసిన స్పీడ్ వీటిలో వుంది."

"ఈ చిత్రాల్లో పాత్రలు ఈ దేశానివా....హాలివుడ్ చిత్రాల్ని అనుకరించి తియ్యటంలో మన చిత్రాల్లో నేటివిటీ దెబ్బతింటుందంటున్నారు. ఓ రకంగా ఈ విమర్శకు సరైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీ ముందుంది."

"నిజమే. ఈ చిత్రాల్లో నేటివిటీ లేదు. ఏ చిత్రాల్లో వుంది చెప్పండి. తెలుగుదనం మన సాంఘికాల్లో వుందా. మన పౌరాణికాల్లోకూడా పాటలకు గిటార్ నెందుకు వినియోగిస్తున్నాం. అదలా వుంచితే విదేశీ ప్రభావం అనేది మన జీవితాల్లోనే వుంది. అడుగడుగునా వుంది. తెల్లారిలేస్తే బ్రష్ నుండి సోప్ దాకా, రేడియో నుండి వీడియో దాకా విదేశాలవే కదా .... మనం అప్పులు చేస్తుంది...."

"మీరు పొలిటికల్ గా వెళ్తున్నారనుకుంటాను."

"కాదు. అయినా ఆ రంగంలోనూ మేమే దున్నేస్తున్నాం కదా. ప్రపంచం విశాలమైనప్పుడు ఈ మార్పులు తప్పవు. ప్రేక్షకుడ్ని మూడు గంటలసేపు వినో

దింప చేయటమే ప్రధానం కాబట్టి, అందుకు నూతన మార్గాల్ని అన్వేషించటమే నా పద్ధతి."

"ఇలాంటి చిత్రాలు చూసి యువతరం చెడిపోతుందని విమర్శ వుంది."

"ఇది నేను ఒప్పుకోను. చెడిపోయేవాడు ఈ సినిమాలు చూడకపోయినా చెడిపోతాడు" కొంచెం కట్టిగానే అన్నాడు.

"అసిస్త్వమా" అని నవ్వాడు విలేఖరి.

"లేకపోతే యేమిటండి రావణాసురుడు యే సినిమాలు చూసి చెడిపోయారంటారు" అన్నాడు నారాయణ్.

"పాయింటే" అన్నాడు విలేఖరి.

అతనికో మంచి కాప్షన్ దొరికింది. ఇంటర్వ్యూ పసందుగా వుందనుకొన్నాడు.

"ఇప్పుడు మీరు తీస్తున్న సన్నివేశాల్ని వివరిస్తారా"

"తప్పకుండా. ఓ దొంగలముఠా తెల్లవారేలోపు ఓ వంతెన్ని అపహరిస్తుంది."

"వ్వాట్" అన్నాడు విలేఖరి నోరు తెరిచి.

"మరేం కంగారుపడకండి. చీకటి పడేలోపు తిరిగి వంతెన నిర్మిస్తారు."

అతనింకా ఆశ్చర్యంనుండి కోలుకోలేదు.

"ఏమిటలా అయిపోయారు" అన్నాడు నారాయణ్ నవ్వుతూ.

"అది కాదండి. మీ క్రొత్తదనానికి నా మతి పోయేట్లుంది."

"థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్. అయితే ఇదేం ఆశ్చర్యపోవాల్సిన సంఘటన కాదు. సరిగ్గా

ఇలాంటిదే అమెరికాలో జరిగింది."

"నిజమా."

"సెంట్ పర్సెంట్. ఓ పేపర్లో ఈ వార్త చదివాక మాకీ ఐడియా వచ్చింది. మా చిత్రంలో మేం సాయంకాలానికి ఎత్తుకుపోయిన వంతెన స్థానంలో మరొకటి నిర్మించేలా రాసుకున్నాం. ఈ రోజు దొంగతనాల్లో, హత్యల్లో అనేక మార్పులొచ్చాయి. ఏం జరిగిందన్నా ఈ రోజుల్లో ఆశ్చర్యం చెందాల్సిన పనిలేదు."

"మీ కెక్కడ దొరుకుతాయండీ ఇలాంటి వార్తలు."

"మీ పత్రికల్లోనే ఏవో మూల వేస్తుంటారు. అవే సేకరిస్తాం. ముఖ్యంగా నా అసిస్టెంట్ సుధాకర్ ఇలాంటివి సేకరిస్తుంటాడు. వాటిమీద మేం కథలల్లుకుంటుంటాం."

"ఈ దృశ్యాలు చూస్తున్నప్పుడు ప్రేక్షకులు నవ్వుకుంటారు కదూ"

"అది చిత్రీకరణమీద ఆధారపడి ఉంటుంది. ఓ విషయాన్ని నవ్వుపుట్టించేలా తీస్తారు కొందరు. నవ్వుకోనివ్వండి. మా చిత్రాలు విజయవంతం కావాలంటే ఏవో కొన్ని మసాలాలుండాలి. ఎవరన్నా ఇలా జరగదని బుకాయిస్తే మా సమాధానం అమెరికాలో జరిగిందనే క్రైమ్‌కున్న అంతర్జాతీయతను మేం ప్రదర్శిస్తున్నాం" అన్నాడు నారాయణ్.

"మీ భావాల్లో వున్న ఆధునికత చిత్రాల్లో కనిపించదేమిటి? ఈ క్రైమ్‌లోనే మరలా సెంటిమెంట్లు. నానా చెత్తంతా కలగాపులగం చేస్తారు" అన్నాడతను.

"నిజమే. పర్సనల్ గా అంగీకరిస్తున్నాను. కానీ ఏం చేస్తాం చెప్పండి. నిర్మాత ఏం చెబితే అది చెయ్యాలి.

అందుకు సిద్ధంగా వుంటేనే ఇక్కడ లైఫ్. సెంటిమెంట్ లేకుంటే తెలుగు ప్రేక్షకులు చూడరనే పిడిసూత్రం పాతుకుపోయింది. కాబట్టి అవుండక తప్పదు."

"మీ జీవితాశయం ఏమిటి?"

"నేను హిచ్ కాక్ ను ఆదర్శంగా తీసుకొన్నాను. అలాంటి చిత్రాలు నిర్మించాలని నా కోర్కె. బయట నిర్మాతలమీద నా భావాల్ని రుద్దలేను. కాబట్టి స్వయంగా చిత్రనిర్మాణం చేపట్టాలని వుంది. తెలుగు ప్రేక్షకులు ఊహించని, సస్పెన్స్ తో, భరించలేనంత ఉత్కంఠతో కూడిన సినిమాలు మా సంస్థనుండి రాగలవని మాత్రం చెప్పగలను" అన్నాడు నారాయణ్.

తాను త్వరలోనే భరించలేనంత ఉత్కంఠతను యెదుర్కోబోతున్నాననే విషయం అతడూహించలేడు.

"మా పాఠకులకు మీరేం చెప్పదలుచుకొన్నారు?"

"శుభాకాంక్షలు అందచేస్తున్నాను. నా చిత్రాల్లో అడ్వెంచర్సుంటాయి. ఆ సాహసాల్ని చూసి యువతరం ఉత్తేజం పొందాలి. నా చిత్రాలు చూసి ఏ ఒక్కరయినా జీవితంలో సాహసానికి పూనుకుంటే నేను గర్వ పడతాను."

"సార్.. షాట్ రెడీ" అంటూ వచ్చాడు సుధాకర్.

"సుధ తెలుసుగా" అన్నాడు పరిచయం చేస్తూ.

"హలో" విష్ చేశాడతను.

"థాంక్యూ ఫర్ యువర్ కో ఆపరేషన్. ఈ ఇంటర్వ్యూ మా పాఠకుల్ని విశేషంగా ఆకర్షిస్తుందని నా నమ్మకం" అన్నాడు విలేఖరి.

"థాంక్యూ" అన్నాడు నారాయణ్.

2

"డాడీ" అంటూ ఎదురు వెళ్ళింది విద్య.

"ఓ మై స్వీట్ గాళ్" అంటూ ఆప్యాయంగా కూతురి తలమీద చేతులు వేసి లోనికి నడిచాడు నారాయణ్.

"షూటింగ్ అయిపోయిందా."

"అయిపోయిందమ్మా."

"ఇంక మద్రాసులోనే వుంటారా?"

"వుంటానమ్మా. నెలరోజులదాకా యెక్కడికీ కదలను."

"మీరలాగే అంటారు వెంటనే వెళ్ళిపోతారు."

"లేదమ్మా....ఇంక మిక్సింగ్, రికార్డింగ్, అన్నీ ఇక్కడే. వేరే చిత్రమంటూ లేదు. అందుకే ఇక్కడ వుంటాననేది."

"మరి నేను వెళ్ళొస్తా సార్" అన్నాడు సుధాకర్ వెనకనుండి.

అప్పుడు గుర్తొచ్చింది నారాయణ్ కు సుధాకర్ తన వెంట వున్న విషయం.

"వెళతావా? సరే. సాయంకాలం ఓసారి ఫోన్ చెయ్యి. ఈ రోజంతా రెస్టు తీసుకుందాం. రేపటినుండి ఆ కార్యక్రమాలు చూసుకోవచ్చు."

"అలాగే సర్."

సుధాకర్ వెళ్ళిపోయాడు.

"డాడీ....సుధాకర్ బ్రదర్ కెలా వుంది."

"నవ్ హీ ఈజ్ ఆల్ రైట్ బేబీ.... పెరాలిసిస్ స్ట్రోక్ లైట్ గా రాబట్టి సరిపోయింది. దాంతో వైద్యం చేయించాం కదా....అన్నయ్య ఏడి."

"కాలేజీకి వెళ్ళాడు."

"అమ్మ."

"పూజలో వుంది."

"ముందు నేను స్నానం చెయ్యాలి" అంటూ డ్రెస్ ఛేంజ్ చేసుకొని బాత్‌రూం కెళ్ళిపోయాడు. స్నానం చేశాక ఫ్రెష్‌గా తయారయి వచ్చాడు.

"డాడీ ఈ వారం 'చిత్ర ప్రపంచం'లో మీ ఇంటర్వ్యూ వచ్చింది చూశారా?"

"ఇంకా లేదమ్మా."

"బాగుంది డాడీ."

"అలాగా" అన్నాడు.

విద్య టీపాయ్ మీదున్న పత్రిక అందించింది.

"ఎప్పుడు రావటం" అంటూ లోపలినుండి వచ్చింది నారాయణ్ భార్య.

"అరగంటవుతుంది."

"విద్యా డాడీకి కాఫీ పంపించు" అందామె.

"మర్చిపోయాను" అంటూ లేచింది విద్య.

"ఏమిటి అమ్మాయి పెళ్ళి విషయం ఏం చేశారు?"

"ఈ సినిమా పూర్తి అవనీ. తీరిగ్గా చూద్దాం."

"తీరికా? మీకా? ఊరుకోండి. నాతో మాట్లాడ టానికే మీకు తీరికుండదు. సినిమావాళ్ళని మాత్రం యెవరూ చేసుకోకూడదు. ఓ ముచ్చట వుండదు. ఓ సరదా లేదు. లక్షలుండగానే సరా ఏ రోజన్నా కలిసి భోంచేశామా? షికారెళ్ళామా?"

"ఆగాగు దండకం చదవకు. నాతోపాటు షూటింగ్ స్పాట్‌కు రావోయంటే వినవు. ఓ షూట్ తీసుకుంటే బ్రహ్మాండంగా ఎంజాయ్ చెయ్యొచ్చు."

"ఏంటి నా బొంద ఎంజాయ్ చెయ్యటం, మీరు ఏ రాత్రికో వస్తే అప్పటిదాకా హోటల్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాలా?"

"సరే ఇంతకూ ఏమిటి నీ గొడవ."

"నా గొడవలానే వుంది. అమ్మాయికి వయసు పెరుగుతుందని మీకు గుర్తుందా? ఇంకెన్నాళ్ళు అమ్మాయి పెళ్ళి చేయకుండా వుంచుతారు. మీ సినిమావారి కవరికైనా కట్టబెట్టాలని చూస్తున్నారేమో అదేం కుదరదు లక్షణమయిన సంబంధం చూడాలి. ఈ సినిమా పూర్తయితే ఇంకోటుంటుంది. మీరదేం పెట్టుకోకుండా అచ్చంగా ఈ పనిమీదే వుండాలి" అందామె.

పనిమనిషి కాఫీ తీసుకొచ్చింది.

"అమ్మాయేది."

"క్రింద వున్నారండి."

నారాయణ్ కాఫీ సిప్ చేస్తున్నాడు.

"నా కూతురిమీద నాకు ప్రేమలేదంటావా? విద్యను చిన్నప్పటినుండి ఎంత అపురూపంగా పెంచాం. మంచి సంబంధం చూసి బ్రహ్మాండంగా పెళ్ళిచేస్తాను. ఈ డబ్బంతా ఏం చేసుకోవాలి గనక. నా చిట్టితల్లికి మంచి బిల్డింగ్ కట్టిస్తాను. ఈ నడుమ కాలంలో ఇలాంటి పెళ్ళి జరగలేదనిపించేలా చేస్తాను" అన్నాడు నారాయణ్ ఎమోషనల్ గా కదిలిపోతూ.

ఫోన్ మ్రోగింది.

"హలో నారాయణ్ స్పీకింగ్."

అవతల ఎవరో మాట్లాడుతున్నారు.

"అలాగే .... అలాగే .... వుంటాను" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"ఎవరండి మాట్లాడుతుంట."

"ఎవరో ప్రొడ్యూసర్. అది సరే ఈ విషయం గురించి నువ్వేం దిగులుపడకు. నేను అమ్మాయి పెళ్ళి గురించి కొంతమందితో చెప్పి వుంచాను. మంచి సంబంధం రాగానే చేద్దాం. ప్రస్తుతం వేరే షూటింగ్స్ లేవు. పనంతా ఇక్కడే. అదంతా సుధాకర్ చూసుకుంటాడు. ఈలోపు ఈ విషయం సెటిల్ చేద్దాం. సరేనా?" అన్నాడు నారాయణ్.

"చూద్దాం .. ఎంతవరకు చేస్తారో" అందామె.

నారాయణ్ నవ్వుతూ పత్రిక అందుకున్నాడు.

"ఊహించని సంఘటనలతో దర్శకుడు నారాయణ్ సమర్పించనున్న చిత్రం" అని వుంది.

చదవటం మొదలుపెట్టాడు.

3

మిక్సింగ్ కార్యక్రమం జరుగుతూంది. టీ బ్రేక్ ఇచ్చారు. అంతా బయటకు వచ్చారు.

నారాయణ్ సుధాకర్‌ను ప్రక్కకు పిలిచాడు.

"ఈ చిత్రం మీదే మనం ఆశలు పెట్టుకున్నాం" అన్నాడు నారాయణ్.

"అవును. ఈ నడుమ వచ్చిన గేప్ ఈ చిత్రంతో తొలిగిపోతుంది."

"ఈ చిత్రం పనయ్యాక మనం చెయ్యాల్సిన కార్యక్రమం ఇంకోటుంది."

"ఏమిటి సార్."

"అమ్మాయి పెళ్ళి."

"చేద్దాం సార్."

"ఇదేమన్నా ఫైటింగ్ సీన్ కాదయ్యా చెయ్య

టానికి. పెళ్ళయ్యా పెళ్ళి. అందులోనూ నా యేకైక విద్యకు యెంతో ఘనంగా పెళ్ళిచెయ్యాలి. అందుకే ముందు మంచి పత్రాడికోసం వెతకాలి. మంచి సంప్రదాయం వున్న కుటుంబంకోసం చూడాలి. అన్నీ కలిస్తే వెంటనే పెళ్ళిచేద్దాం."

సుధ ఆశ్చర్యంగా చూశాడు.

"ఏమిటలా చూస్తున్నావ్. సంప్రదాయాలంటున్నానా? మరవి లేకుంటే ఎలా? మనం సినిమాల్లో రకరకాలుగా చిత్రిస్తుంటాం. అవన్నీ జీవితంలో అప్లై చేసుకుంటే కష్టం."

సుధాకర్ జవాబుగా నవ్వాడు.

"ముందు మనం యెవరికైనా చెబితే నాలుగయిదు సంబంధాలు చూస్తారు. అందులోనూ మా కులంవాడు.. మంచివాడు దొరకాలంటే అర్జెంటుగా దొరకరు" అన్నాడు నారాయణ్.

సుధాకర్‌కు నారాయణ్ కులం యేమిటో తెలియదు. పరిశ్రమలో చాలామంది చాలా రకాలుగా చెప్పుకుంటారు. అయినా మీ కులం ఏమిటంటూ అతనెప్పుడూ అడగలేదు.

సుధాకర్ పది సంవత్సరాలనుండి నారాయణ్ దగ్గర అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు గొప్పగా విజయవంతం కాకపోయినా లాభాలు గడించాయి. అతడికి పెళ్ళైంది. ఇద్దరు పిల్లలు కూడా వున్నారు.

సుధాకర్ తమ్ముడికి పెరాలిసిస్ స్ట్రోక్ వచ్చింది. ఆ సందర్భంలోనే నారాయణ్ ఎంతో డబ్బు ఖర్చుపెట్టి ఆధునిక వైద్యం చేయించాడు. నారాయణ్‌కు సుధాకర్

కుడిభుజంలాంటివాడు. అన్ని పనులూ అతనే చూసు కుంటాడు. ఎప్పటికయినా సుధాకర్ దర్శకత్వంలో తానే ఓ చిత్రం నిర్మించగలనంటూ నారాయణ్ చెబు తుంటాడు.

ఈ నడుమ కాలంలో నారాయణ్ తీసిన కొన్ని సినిమాలు ఫెయిలయ్యాయి. దాంతో క్రొత్తగా అతన్తో చిత్రాలు తియ్యటానికి ఎవరూ ముందుకు రావటంలేదు. అందుకు నారాయణ్ చింతించడు. ఈ పరిశ్రమలోని వాతావరణాన్ని పూర్తిగా జీర్ణించుకున్నాడాయన. పది సినిమాలు పోయినా ఓ సినిమా విజయవంతమయితే నిర్మాతలు ఈగల్లా తముచుట్టూ మూగుతారని నారాయణ్ కు స్పష్టంగా తెలుసు. అందుకే ఈ చిత్రం మీద ఆశలు పెట్టుకున్నాడు.

నిర్మాత కూడా ఖర్చుకు వెనకాడే రకంకాదు. అనేక ఇంగ్లీషు సినిమాలు చూసి వాటిల్లో మంచి దృశ్యాలు ఏరి ఓ కథ అల్లారు. కథ ప్రధానం కాదు ఇలాంటి చిత్రాల్లో. కథనం ఎలా వుంటుందనేదే ప్రధానంగా ఉంటుంది. ఈ చిత్రం విజయవంతం కావటంమీదే అతని భవిష్యత్ ఆధారపడి వుంటుంది. మరే నిర్మాత రాకుంటే స్వయంగా చిత్రనిర్మాణం చేపట్టాల్సి వుంది.

సుధాకర్ థియేటర్ లోకి వెళ్ళిపోయాడు. నారాయణ్ బయటకు చూస్తున్నాడు. గార్డెన్ లో రకరకాల మొక్కలు అందంగా వున్నాయి.

4

నారాయణ్ భాగ్యతో పిచ్చాపాటి మాట్లాడు తున్నాడు.

ఫోన్ రింగయింది.

ఫోన్ తీసుకున్నాక "నారాయణ్ గారా" అని విన పడింది.

"అవును."

"ఇంటిదగ్గరే వుంటారా."

"వుంటాను."

"ఏం లేదు. మీతో మాట్లాడాలి బయలుదేరి వస్తున్నా."

"రండి" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"ఎవరండి" అంది నారాయణ్ భార్య.

"ప్రొఫెసర్ రాజేంద్రగారొస్తున్నారు. ఏదో మాట్లాడాలట. ఏ విషయమో మరి."

ఆమెతో మాట్లాడుతుండగానే రాజేంద్ర వచ్చాడు.

"రండి..రండి" అంటూ ఆహ్వానించాడు నారాయణ్.

నారాయణ్ భార్య లేచి లోపలకు వెళ్ళింది.

"చెప్పండి ఏమిటి విషయం."

"ఏం లేదు. ఆ నడుమ సంబంధం ఒకటి చూడమన్నారు కదా."

"అవును. ఎవరన్నా వున్నారా?"

"ఉన్నాడండి. నాకు తెలిసిన వారిలో ఓ అబ్బాయున్నాడు."

"ఏం చేస్తున్నాడతను."

"గుంటూరులో ఆటోమొబైల్స్ వ్యాపారం వుంది. మొత్తం వారు ముగ్గురన్నదమ్ములు. ఇతను రెండోవాడు. కుటుంబం మంచిది. అంతా మంచి పొజిషన్‌లో వున్నారు. ఈ సంబంధం అయితే అమ్మాయికి బాగుంటుందనిపించింది."

"కుర్రాడెలా వుంటాడు,"

"హీరోలా వుంటాడు. కాకుంటే కొంచెం ఎత్తు తక్కువ. అలాగని పొట్టి కాదనుకోండి. రెడ్ చావ్. బాగుంటాడు."

"బాగానే వుంది" అన్నాడు నారాయణ్.

"కాఫీనా, కూల్ డ్రింకా" అన్నాడు ఏదో గుర్తొచ్చి.

"ఇప్పుడెందుకండి."

"ఫర్వాలేదు. ఏదో ఒకటి తీసుకోండి."

"కాఫీ" అన్నాడాయన.

నారాయణ్ లేచి వెళ్ళి కాఫీ పంపమని చెప్పి వచ్చాడు. వెంటనే ఫోన్ తీశాడు. నెంబర్ డయల్ చేశాడు.

"హలో.... నేను నారాయణ్ మాట్లాడుతున్నా.... అవును. నువ్వు వెంటనే బయలుదేరి రా" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"మరయితే ఈ సంబంధం ఓ.కె. అంటారా."

"తప్పకుండా. ఆల్ రైట్. మనం ఎలా ప్రొసీడవ్వాలి" అన్నాడు నారాయణ్.

"ఏముంది మీరు సరేనంటే వాళ్లొచ్చి అమ్మాయిని చూస్తారు. ఏదో ముహూర్తంచూసి ముడేస్తే సరి" అన్నాడు తేలిగ్గా.

"అలాగని కాదు. ముందు వెళ్ళి మనం మాట్లాడాల్సిన అవసరంలేదా అని."

"ఏముంది. మీ తరపున నేను వెళ్ళి మాట్లాడివస్తాను. అమ్మాయి ఫోటో ఒకటి ఇవ్వండి. వాళ్ళకి చూపిస్తాను. వారికి నచ్చితే మిగతా ఫార్మాలిటీస్ దేముంది?" అన్నాడు రాజేంద్ర.

"అలా బాగుంటుందా. సరే మీ ఇష్టం. ఈ విషయంలో పూర్తి బాధ్యత మీదే. మీరు తెలుసునంటున్నారు కాబట్టి అన్నీ మాట్లాడి మీ చేతు-మీదుగా ఈ శుభ కార్యక్రమం జరిపించండి" అన్నాడు నారాయణ్.

పనిమనిషి వచ్చి కాఫీలు సర్ది వెళ్ళింది. ఇద్దరూ కాఫీ సిప్ చేస్తూ కూర్చున్నారు.

"అవును మీ సినిమా రిలీజెప్పుడు?"

"అదే ఆలోచిస్తున్నాం. ఫస్టు కాపీ రెడీ అయింది. రెండు పెద్ద సినిమాలు ఈ వారంలో వున్నాయి. అందుకే ఆలోచిస్తున్నాం. ఏమయినా ఈ నెలాఖరులోపు అవుతుంది లెండి."

సుధాకర్ వచ్చాడు.

"రా, రా. గురువుగారు ఓ సంబంధం చూశారు. దాని డిటైల్స్ మాట్లాడుతున్నాం. అది సరేనండి. మీరు వెంటనే గుంటూరు వెళితే బాగుంటుందని నా అభిప్రాయం."

"ఇప్పుడేనా?"

"ఆలస్యం అమృతం విషం అన్నారు."

"అలాగే. నాకూ వేరే పనులు లేవు."

"సుధా అమ్మాయి ఫోటో ఒకటి మంచిది చూడు. నువ్వు కూడా రాజేంద్ర గారితో వెళ్ళు. గుంటూరులో లాడ్జింగ్ లో దిగండి. అన్ని పనులూ ముగించుకున్నాక ఓ డేట్ ఫిక్స్ చేయండి. ఆ రోజు వారు అమ్మాయిని చూట్టానికొస్తే మిగతా విషయాలు మాట్లాడుకోవచ్చు" అన్నాడు నారాయణ్.

రాజేంద్రగారితో సుధాకర్‌ని తన కారులో పంపేక రిలాక్స్ అయ్యాడు ఆయన.

అతని కళ్ళముందు పెళ్ళికూతురిగా విద్య కదలాడు తూంది.

5

సుధాకర్ ఏర్పాట్లు చేస్తూ హడావుడిగా వున్నాడు.

నారాయణ్‌కూ ఊపిరాడనంత పని.

ఆ రోజే సినిమా విడుదలయింది.

ఎన్నో ఆశలు పెట్టుకున్న చిత్రం.

ఎన్ని సంవత్సరాలుగానో ఎదురుచూస్తున్న అమ్మాయి పెళ్ళి.

తాంబూలాలు పుచ్చుకునే రోజు.

నారాయణ్‌కు బ్లడ్ ప్రెషర్ వుంది.

ఆయన అసిస్టెంటులు కోపం వచ్చి తిట్టినా అందుకే పట్టించుకోరు.

సాయంకాలం నాలుగు గంటలకు గుంటూరు నుండి వస్తారు.

విద్య మనసు ఏవేవో ఊహల్లో తేలిపోతూంది. దొంగ తనంగా ఆ ఫోటో చూడాలనుకుంది. ఎందుకో అది ఇంట్లో వుంచలేదు. తాను చూడగానే భార్యకు చూపించి ఆ తర్వాత ఇచ్చేశాడు. సినిమావారి సంబంధం కాదన్నాక ఆమె వెంటనే అంగీకరించింది. నారాయణ్ భార్య అంతగా విసిగిపోయిందాయనతో.

నారాయణ్ ఇంట్లో లేడు. ఆయనకు సుధాకర్‌కు బాధ్యతలు అప్పగించాక నిశ్చింతగా వుండటం అలవాటు.

ఉదయం ఆట అయ్యాక ఆ చిత్రం భవిష్యత్ ఏమిటో తేలిపోతుంది. ఆంధ్ర దేశం నుండి వచ్చే ఫోన్

కాలేజ్ కోసం కూర్చున్నాడాయన నిర్మాతల్తో కలిసి.

విద్య సాధారణంగా బయటకు రాదు. ఎప్పుడయినా బయటకు వెళితే తల్లితండ్రుల్తో బయటకు వెళ్ళటం, రావటం కారులో నే. అంత అపురూపంగా పెంచారామెను.

విద్యకు హెయిర్ పిన్ కావాల్సి వచ్చింది.

ఇంట్లో వున్నవి మరీ పాతగా వున్నాయి.

ఆ ఇంటికి కొంచెం దూరంలో ఓ ఫ్యాన్సీ షాపు వుంది. ఇంట్లో నౌకర్లంతా తలో పనిమీద వున్నారు. అమ్మ గదిలో ఏవో పరిశీలించటంలో మునిగిపోయి వుంది. ఆమెకు పిలిచి చెప్పేలోపు షాపుకు వెళ్ళి రావచ్చు.

ఇంటినుండి బయటకు నడిచింది.

ఆమె కాంపౌండు దాటి తలుపుతీసింది.

కొంచెం దూరంలో షాపు కనపడుతూంది.

అటు అడుగులు వేసింది.

సర్రున దూసుకొచ్చిందో కారు.

విద్య అదిరిపడి పక్కకు తప్పుకొంది.

అకస్మాత్తుగా కారు ఆగింది.

తలుపు తెరుచుకోవటం, ఓ వ్యక్తి విద్యను లోపలికి లాక్కోవటం క్షణాల్లో జరిగిపోయింది. కారు ముందుకు దూసుకుపోయింది.

ఆ రోడ్డు నిర్మానుష్యంగా వుందా సమయంలో.

షాపులోకూడా యెవరూ ఈ దృశ్యాన్ని గమనించలేదు.

విద్య బిగ్గరగా అరవాలని నోరు తెరిచింది.

కళ్ళు మూతలు పడుతున్నాయి....

కళ్ళముందు ఏవేవో వలయాలు....

రంగులు రంగులుగా....

ఆమె తల వాల్చేసింది.

ఊహించని సంఘటన!

6

నారాయణ్ కారునుండి దిగి లోపలకు నడిచాడు.

తమ అంచనాలు దెబ్బతిన్నట్టుగానే భావించాలి.

చిత్రంమీద 'ఏవరేజ్' అనే టాక్ వచ్చింది.

మొదటి ఆట అయ్యాక 'ఏవరేజ్' అని టాక్ వస్తే ఆ తర్వాత పరిస్థితి దారుణంగా వుండొచ్చు. ముఖ్యంగా ఈ సినామాలకు మొదట్లోనే టాక్ బాగుండాలి. సాంఘిక చిత్రాలుగాని, కళాత్మక చిత్రాలుగాని మెల్లగా టాక్ పుంజుకొని విజయం సాధిస్తుంటాయి. కాగా మొత్తంమీద ఈ చిత్రంకూడా ఫెయిలయినట్లు లెక్క.

ఇటీవలకాలంలో రెండు సాంఘికాలు, ఓ ప్రేమ కథా చిత్రం అంగీకరించి చేతులు కాల్చుకున్నాడు. ఆ నిర్మాతలు దిక్కులేకుండా పోయారు. ఇంక తిరిగి మార్కెట్ సాధించాలంటే స్వయంగా చిత్రాలు నిర్మించుకోవాల్సిందే. మరో మార్గంలేదు.

"సుధాకర్ వచ్చాడా?" అడిగాడు భార్యను.

"ఇంకా యేవేవో చిన్న వస్తువులు కావాలంటే బజారుకు వెళ్ళాడు."

"అన్ని యేర్పాట్లూ పూర్తయ్యాయా?"

"ఆహాఁ....అమ్మాయికి నగలేం పెట్టాలా అని ఆలోచిస్తున్నా."

"మరీ వున్నవన్నీ దిగెయ్యకు. అందంగా వుండాలంటే ఒకటో రెండో చాలు."

"మరీ ఒకటయితే బాగుండదులెండి. అమ్మాయి చీరలు సెలక్ట్ చేసుకుంటూంది. నడుమ నేనెందుకని మానేశాను."

"పోనీలే."

"సుధ స్వీట్సుకూడా స్పెషల్ గా ఆర్డరిచ్చాడట."

"అతనంతా చూస్తాడులే. నాకు తలనొప్పిగా వుంది."

"ఏమయింది. అన్నట్టు సినిమా గురించి యేమనుకుంటున్నారు?"

"ఏదో వీకరేజిగా వుందట."

నారాయణ్ భార్యకు అర్థమైపోయింది.

ఆయన ఆ చిత్రంమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో ఆమెకు బాగా తెలుసు!

"మీరు కొంచెంసేపు పడుకోండి. అమృతాంజనం రాయమంటారా?" అందామె.

"నువ్వా పనులు చూడు. కొంచెంసేపు విద్యను పంపించు" అన్నాడు.

ఆమె క్రిందకు వెళ్ళిపోయింది.

పదినిమిషాలు గడిచాయి.

ఆలోచిస్తూన్న నారాయణ్ తలెత్తాడు.

అప్పుడు గుర్తువచ్చింది తను విద్యను పంపమన్న విషయం.

లేచి బయటకు నడిచాడు.

"విద్యా" పిలిచాడు.

నారాయణ్ భార్య పరిగెత్తుకుంటూ వచ్చింది.

ఆమె మొఖంలో ఆందోళన నిండివుంది.

"విద్యేది."

"కనపడటం లేదండి."

"ఊఁ" అన్నాడు ఒక్కసారిగా.

శరీరంలో రక్తం ఉప్పెనలా ప్రవహిస్తున్నట్టుంది. చేతులు వణుకుతున్నాయి. అమాంతం కూలిపోతానేమో అనుకున్నాడు. నారాయణ్ భార్య అతన్ని జాగ్రత్తగా పొదివి పట్టుకొని మంచందాకా నడిపించుకొనిపోయింది. నారాయణ్ గుండె వేగం హెచ్చింది.

"ఇల్లంతా చూశావా?"

"ఇప్పటిదాకా చూశానండి."

"ఎవరింటికన్నా వెళ్ళిందా?"

"అదెప్పుడయినా బయటకు వెళ్ళిందా? వెళ్ళినా చెప్పకుండా వెళుతుందా?"

"అయితే ఏమయింది?"

"అదే అర్థంకావటంలేదు."

"ఓ వేళ సుధతో కలిసి షాపింగ్‌కు వెళ్ళిందా?"

"సుధతో ఎందుకు వెళుతుందండి."

"అవును. ఎందుకు వెళుతుంది" అన్నాడు నారాయణ్.

"ఓ వేళ అన్నయ్యతో కలిసి వెళ్ళిందేమో."

అప్పుడే కారు వచ్చి ఆగింది. ప్యాకెట్లు తీసుకొని సుధాకర్ వచ్చాడు. గదిలోకి రాగానే డీలాపడిపోయిన నారాయణ్ కనిపించాడు.

"ఏం సార్ అలా వున్నారు?"

"విద్య కనిపించటంలేదు."

"కనిపించటంలేదా" అన్నాడు కంగారుగా.

"డాడీ" అంటూ లోనకు వచ్చాడు మోహన్.

మోహన్ నారాయణ్ కొడుకు.

"విద్య వచ్చిందా మోహన్."

"విద్య ఇంట్లో లేదా?"

ఆ ఆశకూడా అంతరించటంతో నారాయణ్‌కు బి.పి. రైజ్ అయింది.

మొఖం కందగడ్డలా తయారయింది.

నారాయణ్ భార్య వెంటనే టేబుల్ సొరుగులాగి టాబ్లెట్స్ ఇచ్చింది. వాటిని మింగి నీళ్ళు త్రాగాడు.

సుధాకర్ ఆందోళనగా చూస్తున్నాడు.

"ఇప్పుడేమిటి చెయ్యటం" అన్నాడు నారాయణ్.

"మీ కెలా వుంది. డాక్టర్‌కి ఫోన్ చెయ్యమంటారా?"

"నో. ఐయామ్ ఆల్‌రైట్. నేను చావను. ఇప్పుడేమిటి చెయ్యాలి?"

"పోలీస్ రిపోర్టిద్దాం."

"అదిసరే. వాళ్ళు బయలుదేరి వస్తారు కదా. గుంటూరుకు ఫోన్ చేసి చెబితేసరి."

"వాళ్ళీపాటికి బయలుదేరి వుంటారు" అన్నాడు సుధాకర్.

"అయితే ఏం చెయ్యటం?"

"ఓ. పని చేద్దాం సార్. మీకు ఆరోగ్యం బాగోక హాస్పిటల్లో జాయినయ్యారని చెబుదాం. ఆ తర్వాత మరో 'డేట్ ఫిక్స్ చేసుకుందాం."

"అలా చేద్దామంటావా?"

"ఓ. క. రాజేంద్రగారికి ఫోన్ చేసి ఇటివ్వు" అన్నాడు వెంటనే.

సుధాకర్ వెంటనే ఆ పనిచేశాడు.

"అవును. నేనే మాట్లాడుతున్నా. అమ్మాయి కనిపించటంలేదు. అదే ఆలోచిస్తున్నా. నేను ఆసుపత్రిలో చేరానని చెప్పండి. వాళ్ళకి అనుమానం రాకూడదు. వెంటనే పోలీస్ రిపోర్టిస్తున్నా. స్వయంగా వెళ్ళి

సి ఎమ్.గార్ని కలుస్తాను. త్వరలోనే మరో తేదీ ఫిక్స్ చేద్దాం. అంతా మీ చేతుల్లో వుంది. జాగ్రత్తగా హాండిల్ చెయ్యాలి. అర్థమయ్యింది కదా. వస్తూ వుంటాను. అలాగే" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"కమాన్. మనం రిపోర్టివ్వాలి" అంటూ లేచాడు.

"మీరు కంగారు పడకండి" అందామె ఆందోళనగా.

"నాకేం కాదు. సుధా మనం వెంటనే సి.ఎమ్.ని కలుస్తున్నాం."

"అలాగే సర్."

"ఈ లోపు ఈ వార్తను మీరు బయటకు పొక్క నియ్యకండి."

"అలాగే" అన్నారు భార్య, మోహన్.

"పనివాళ్ళకికూడా తెలియకూడదు."

"అలాగే."

చకచక డ్రస్ మార్చుకున్నాడు. వేగంగా బయటకు నడిచాడు. సుధాకర్‌ను నారాయణ్ భార్య కళ్ళతో హెచ్చరించింది.

తలూపుతూ అనుసరించాడు సుధాకర్.

ఆమెకు కూతురు విషయంకన్నా భర్త ఆరోగ్య విషయమే ఆందోళన కలిగించుతూంది.

నారాయణ్ కారు సి.ఎమ్. ఇంటివైపు దూసుకెళ్తూంది.

7

సి.ఎమ్.గారు రాజకీయాల్లోకి రాకముందు ప్రముఖ సినిమా హీరో. ఆయనెక్కువగా వీరోచిత కార్య క్రమాలు నిర్వహించే నాయకుడి పాత్రలనే పోషించే వాడు. క్రైమ్ సినిమాల్లో నటించినా దేశభక్తి గురించి

అనర్గళంగా ఆయన ఉపన్యాసం, ఓ పాటయినా వుండేవి. అందుకే సామాన్య ప్రజానీకంలో ఆయనపట్ల విపరీతమైన అభిమానం వుంది.

ఆ అభిమానమే రాజకీయాల్లో తలలు పండిన వారిని కాకుండా ఆయన్నే రాష్ట్రాధినేతగా చేసింది.

నటుడుగా వున్నప్పుడు ఆయన నారాయణ్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించాడు.

ఆ పరిచయాన్ని ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఆయన మరిచిపోలేదు.

సినిమా రంగానికి చెందిన అనేక ఫంక్షన్స్‌లో కలిసినప్పుడు ముఖ్యమంత్రిగారే స్వయంగా పలకరించి కుశల ప్రశ్నలు అడుగుతుండటం జరుగుతూంది. అయినా సరే నారాయణ్ ఏనాడూ ఆప్యాయతను వినియోగించుకునే ప్రయత్నం చెయ్యలేదు.

నారాయణ్ విజిటింగ్ కార్డు పంపాక వెంటనే ప్రవేశం లభించింది. ముఖ్యమంత్రికి ఇటీవల కాలంలో ఆరోగ్యం బాగుండటంలేదు. అందుకే ఇప్పుడు లభించారు. ఈ సమయంలో అరుదుగానే ఆయన వ్యక్తుల్ని కలుసుకుంటున్నారు.

"ఏమిటి నారాయణ్‌గారూ.... యేదో విశేషంలేందే మీరు రారుకదా" అన్నాడాయన సరదాగా.

అప్పటికి ఆయన నారాయణ్ ముఖంలో విషాద రేఖల్ని గమనించలేదు.

"మా అమ్మాయి కన్పించటంలేదు" అన్నాడు మాటలు పెగుల్చుకొని.

సి.ఎమ్. నిటారుగా అయ్యాడు....

"సరిగ్గా చెప్పండి. ఏమిటి మీరనుకోవటం?"

"ఈ రోజు అమ్మాయికి పెళ్ళిచూపులు. తాంబూలాలు తీసుకోవాలనుకుంటున్నాం. అందరం ఆ పనుల్లో వున్నాం. తీరా చూస్తే అమ్మాయి కనిపించటంలేదు."

"ఏం జరిగుంటుందనుకొంటున్నారు?"

"ఎవరో తీసుకెళ్ళి వుంటారు."

"ఇంటినుండి బలవంతంగా తీసుకెళ్ళారంటారా?"

"ఏమో తెలియదు. ఎవరి గదుల్లో వారు పని చేసుకుంటున్నారు. అమ్మాయి గదిలో వుందనుకున్నాం. అందుకే అమ్మాయి ఎలా మాయం అయిందో అర్థం కావటంలేదు."

సి.ఎమ్. కొంత సేపు ఆలోచించాడు.

"మరోలా భావించకండి. అమ్మాయికి పెళ్ళి ఇష్టం లేదా?"

"అదేం లేదు. వుంటే అమ్మాయికి ఈ విషయం నాకు చెప్పే చనువుంది. ముఖ్యంగా విద్య అమ్మచాటు బిడ్డ. మాతో తప్పించి కనీసం బయటకు వెళ్ళదుకూడా."

"ఓ విషయం నారాయణ్. పిల్లలకెలాంటి భావాలు లేవనుకోవటం సరయింది కాదు. మీతో ఎంత చనువుగా వున్నా వాళ్ళు అనేక భావాల్ని భయం వల్లనో, సిగ్గు వల్లనో దాచుకోవచ్చు. మన కార్యకలాపాల ప్రభావం కూడా పిల్లలమీద అదృశ్యంగా పడుతుంటుంది. మరీ తల్లిచాటు బిడ్డగా పెంచటం మంచిది కాదు. ఇప్పుడు తల్లిచాటు బిడ్డ. రేపు భర్తచాటు బిడ్డ. ఆ తర్వాత బిడ్డలచాటు బిడ్డయితే ఆమె ఇండివిడ్యువాలిటీ ఎక్కడ? ఎప్పుడు బిల్డప్ చేసుకుంటుంది" అన్నాడాయన.

నారాయణ్ తలవంచుకున్నాడు.

"మీరేదో బాధతో వస్తే విసిగిస్తున్నానని భావించ

కండి. సో....మీ నమ్మకం ప్రకారం అమ్మాయిని ఎవరో అపహరించారనుకుందాం. ఎక్కువగా డబ్బుకోసం ఇలాంటి పనులు చేస్తారు. అందుకే జరిగుంటే వాళ్ళు మీకు సమాచారం పంపిస్తారు. ఈలోపు మనం సెర్చ్ కార్యక్రమం మొదలుపెడదాం" అంటూనే బజర్ నొక్కాడు.

సేవకుడు ప్రవేశించాడు.

"సెక్రటరీని పిలువ్."

సెక్రటరీ వచ్చాడు.

"నారాయణ్ గారి అమ్మాయిని ఎవరో తీసుకువెళ్ళారు. మాకు ఏక్షన్ కావాలి. వెంటనే ఆ అమ్మాయిని ట్రేస్ చెయ్యండి. మరో విషయం. ఈ సంగతి సీక్రెట్ గా వుంచండి. వెంటనే అధికారుల్ని సంప్రదించండి. క్విక్."

అతను తలూపి వెళ్ళిపోయాడు.

సి.ఎమ్. తిరిగి బజర్ నొక్కాడు.

"ఏపిల్ జ్యూస్" చెప్పాడు సేవకుడితో.

ఏపిల్ జ్యూస్ వచ్చింది.

అంతా సిప్ చేస్తున్నారు.

"మీరేం బాధపడకండి. వెంటనే ఆ విషయంలో ఏక్షన్ తీసుకుంటారు. మీకు యెలాంటి సమాచారం అందినా తెలియచేయండి" అన్నాడు సి.ఎమ్.

"మరి మేం వెళ్ళొస్తాం" అన్నాడు నారాయణ్.

"మంచిది" అంటూ లేచాడాయన.

ఆయన చూపించిన గౌరవ, మర్యాదలకు ఉద్వేగంతో నారాయణ్ కళ్ళు చెమ్మగిల్లాయి. ఆకళ్ళలో కనిపించిన భావాన్ని ఆయన మరోవిధంగా అర్థంచేసుకున్నాడు.

"ఐ విల్ ట్రై మై లెవల్ బెస్టు మిష్టర్ నారాయణ్"
అంటూ మరోసారి ఆప్యాయంగా భుజం తట్టాడు.

8

నిమిషాలమీద సి. ఎస్.గారి ప్రభావం కనపడింది. నారాయణ్ వెళ్ళిన పది నిమిషాలకల్లా ఇన్వెస్టిగేషన్ డిపార్ట్ మెంట్ కు చెందిన ప్రముఖులు వచ్చారు.

నారాయణ్ ఇంటిలో పనివారందరినీ పిలిచి ప్రశ్నించారు.

చివరగా నారాయణ్ దగ్గరకొచ్చారు.

"ముందు మనం అమ్మాయి అపహరించబడ్డ 'టైం' తెలుసుకోగలిగితే ప్రొసీడ్ కావటానికి అవకాశం వుంటుంది."

"ఏం కావాలో అడగండి" అన్నాడు నారాయణ్.

"మీ అమ్మాయి తప్పిపోయిందని మీ కెప్పుడు తెలుసు కున్నారు?"

"నేను పన్నెండున్నర ...ఆ ప్రాంతంలో వచ్చాను. రాగానే నా మిసెస్ తో మాట్లాడి తలనొప్పిగా వుందని పించి అమ్మాయిని పైకి పంపించమని ఆవిడతో చెప్పాను. ఆ తర్వాత పదినిమిషాలకు అమ్మాయి తప్పిపోయిందని తెలి సింది."

"అంతకుముందు చివరిసారిగా అమ్మాయిని ఎప్పుడు చూసుంటారు."

"ఉదయాన్నే చూశాను. ఎనిమిది గంటలకల్లా నేను వెళ్ళిపోయాను. అదే ఆఖరుగా చూడటం."

"మీరు చివరిసారిగా ఎప్పుడు చూశారు" నారాయణ్ భార్యను ప్రశ్నించారు.

"అంతకుముందు గంట క్రితం చూశాను. అయితే టైం

నాకు గుర్తులేదు. అమ్మాయి తన గదిలో చీరలు సెలక్టు చేసుకుంటూంది. నేను నా గదిలో పనిచూసుకుంటు న్నాను."

"మొత్తంమీద ఓ గంట గంటన్నర మీ అమ్మాయిని కలవలేదు. అంతేనా?"

"అంతేనండి."

"కాబట్టి పదకొండు గంటలనుండి యెప్పుడయినా ఆమెను అపహరించటానికి అవకాశాలున్నాయన్న మాట. మీ అమ్మాయి బయటకు వెళ్ళే అవకాశాలున్నాయా?"

"లేదు. ఆ అవసరం ఎలాంటి పరిస్థితిల్లోనూ వుండదు."

"ఏదయినా అవసరంవచ్చి, షాపింగ్ కుగాని...."

"లేదు. ఏం కావాలన్నా పనివాళ్ళున్నారు."

"మీకు ఇంటి ముందు ఖూర్ఖా వున్నాడా."

"లేదు."

"బయట లాన్ లోకి వెళుతుందా?"

"వెళ్ళవచ్చు."

"మా ఉద్దేశ్యం బయట తిరుగుతున్నప్పుడు రోడ్డుమీద ఏమయినా జరిగితే ఆమె వెళ్ళటానికి అవకాశం వుంటుంది కదాని"

ఎవరూ మాట్లాడలేదు.

"మీ కెవరిమీదయినా అనుమానముందా?"

"లేదు" అన్నాడు నారాయణ్.

"మీకు శత్రువులెవరైనా...."

"నాకు తెలిసినంతలో లేరు. తెలియకుండా ఎవరైనా వున్నారేమో."

"కొంచెం బయటకొస్తారా" అన్నారు.

నారాయణ్ బయటికెళ్ళాడు.

"సుధాకర్ మీద మీ అభిప్రాయం ఏమిటి?"

"అతను నా కుడి భుజం. నా ప్రాణం. మీరు అతన్ని శంకించాల్సిన పనిలేదు."

"అది మా డ్యూటీ....మరలా కలుస్తాం. ఏమయినా కబురందితే వెంటనే తెలియచెయ్యండి."

"తప్పకుండా."

"మేం వస్తాం."

వాళ్ళు వెళ్ళిపోయారు.

నారాయణ్ ఇంటికి కొంచెం దూరంలో వున్న షాపు దగ్గరకు వెళ్ళారు. వారికి తమ ఐడెంటీ కార్డు చూపించాక షాపు ఓనర్ వణుకుతూ అన్నాడు "ఏం కావాలి సర్."

"కొంచెం ఇన్ఫర్మేషన్ కావాలి. కొంచెం బయట కొస్తారా."

"అలాగే" అంటూ ప్రక్కనున్నతనికి కొట్టు అప్పగించి కంగారుగా వచ్చాడు. కొన్ని స్మగుల్డు గూడ్స్ ఆ షాపులో వున్నాయి. అందుకే అంత కంగారు.

"ఏమిటి సార్" అన్నాడతను.

"పదకొండు గంటలనుండి ఈ వీధిలో ఏమైనా గలాభా జరిగిందా?"

"ఏం లేదండి."

"ఐ మీన్ ఏక్సిడెంట్లులాంటివి."

"అవ్వే లేదండి."

"ఎవరయినా అమ్మాయి ఒంటరిగాగాని, జంటగా గాని నడిచి వెళ్ళిందా?"

"ఏమోనండి. ఎవరెవరో అమ్మాయిలు వెళుతుంటారు. ఏ అమ్మాయని చెప్పమంటారు?"

"పోనీ పదకొండు గంటల తర్వాత కార్లు వెళ్ళటం

గాని, అందులోనుండి యెవరైనా అరవటంగానీ విన పడిందా?"

"కార్లు చాలా వెళుతుంటాయండి. అరవటం మాత్రం జరగలేదు. అలా అయితే మేం వెంటనే పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ చేస్తాం" అన్నాడతను.

"గుడ్."

"ఎందుకు సార్ ఇదంతా."

"ఓ కేసు విషయంలో ఇన్ ఫర్ మేషన్ కావాల్సి."

"మర్డర్ కేసా?"

"కాదు. కిడ్ నాపింగ్ కేసు."

వాళ్ళు ఓ ఫోటో తీసి చూపించారు.

"ఈ అమ్మాయిని మీరు ఇవాళ చూసినట్లు గుర్తుపట్ట గలరా?"

పరీక్షగా చూశాడు ఫోటోవంక. ఎక్కడో చూసి నట్లుంది.

"లేదండి."

"ఈ మెప్పుడైనా మీ షాపుకు వచ్చిందా?"

"లేదండి. కానీ ఆ మెను ఎక్కడో చూసినట్లు గుర్తు."

"థాంక్యూ....పదకొండు గంటల తర్వాత ఈ వీధిలో యేమైనా జరిగిందని యెవరైనా అనుకుంటుంటే ఈ నెంబర్ కు తెలియజెయ్యండి" అంటూ ఓ విజిటింగ్ కార్డు అందించారు.

"తప్పకుండా సార్" అన్నాడతను వినయంగా.

9

నారాయణ్ ముందు పెద్ద బాటిల్ వుంది.

అప్పటికి రెండువంతులు ఖాళీ అయింది.

"సుధా నేనెవరికైనా అన్యాయం చేశానా?"

"అదేంమాట సార్" అన్నాడు సుధాకర్.

"మరెందుకిలా అయింది. నా విద్యకి ఘనంగా పెళ్ళి చేసి పంపించాలనుకున్నాను. అసలది బ్రతికుందంటావా?"

"అలా మాట్లాడకండి. పోలీసులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు?"

"ఏం ప్రయత్నం చెయ్యటం. రెండురోజులయింది. రేపెప్పుడో ఫోన్ వస్తుంది ఏ కాలవలోనో, సముద్రపు ఒడ్డునో ఓ అమ్మాయి శవం దొరికింది గుర్తించటానికి రమ్మంటూ, అంతేగా. నా కూతురి పండంటి జీవితం నాశనం చేశారు. లేకపోతే యెందుకు తీసుకెళ్ళటం.... డబ్బు కావాలా....రమ్మను.... నాకున్నదంతా పారేస్తాను. నా బిడ్డను నాకు పంపించమను. నా కూతురు నాకు కావాలి" నారాయణి గొంతు వణికింది.

"మీరు భయపడకండి. అమ్మాయికి ప్రమాదం జరగదు. నాకు నమ్మకం వుంది."

"అంతే నంటావా....సుధా మన సినిమాల్లో చూపిస్తున్నట్లు అమ్మాయిని యెవరైనా తీసుకెళ్ళి అమ్మేస్తారేమో. ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి వ్యభిచార గృహాల్లో అమ్ముకుంటున్న ముఠాలకు విద్య దొరికితే దాని గతేమిటి?"

"అలా జరగదు. ఏవేవో ఊహించకండి."

"మరెలా జరుగుతుందయ్యా..అదెవరినన్నా ప్రేమించి వెళ్ళిపోయిందా? అలా అయితే విద్య నాకెందుకు చెప్పలేదు. దానిమాట నేను కాదన్నానా? అదేరోజయినా బయటకు వెళ్ళిందా? ఎవరన్నా దానికి తెలుసా? మరెప్పుడు ప్రేమించింది? ఎలా వెళ్ళిపోయింది? నా విద్య యేమయింది....యేమయింది చెప్పు?"

"ప్లీజ్ మీరు ఆవేశపడకండి. మీరు రెస్టు తీసుకోండి."

"ఇంకేం విశ్రాంతి. నా విద్య నాకు లేకుండా పోయాక ఇంకా నాకు విశ్రాంతెందుకు? సుధాకర్ నాకు విద్య కావాలి....విద్య కావాలి" నారాయణ్ బిగ్గరగా ఏడుస్తున్నాడు.

అతని కళ్ళవెంట కారుతుంది గ్లిసరిన్ కన్నీరుకాదు. గుండె లోతులనుండి పొరలివస్తున్న దుఃఖం.

"నా విద్య చచ్చిపోకూడదు. ఈ సమాజంలో ఆడదానికి రక్షణలేదు. ఎవడికీ దిక్కులేదు. ఎప్పుడేమవుతుందో తెలియదు. నా కూతుర్ని ఏం చేస్తున్నారో.... అమ్మా విద్యా....ఎక్కడున్నావమ్మా...."

ఉద్వేగంతో కదిలిపోయిన నారాయణ్ చెయ్యి విసురుగా బాటిల్ కి తగిలింది.

దూరంగా పడి భళ్ళున బ్రద్దలయింది.

గదంతా గాజు పెంకులు—నారాయణ్ హృదయంలా.

మత్తెక్కించే వాసన—నారాయణ్ చిత్రాల్లా....

చల్లటి ఆ గది నాలుగుమూలలా పరుచుకుంటున్నాయి నారాయణ్ ఏడుపు తాలూకు ధ్వని తరంగాలు!

10

ఫోన్ మ్రోగింది.

నారాయణ్ భార్య అందుకొంది.

"హలో, ఎవరు మాట్లాడుతుంది?"

"నారాయణ్ గారున్నారా?"

"ఉన్నారు ఎవరు మీరు?"

"ఆయనతో మాట్లాడాలి. ముందాయనకు ఫోని

వ్వండి."

ఆదేశించా రవతలనుండి.

ఆమెకు కోపం వచ్చినా తమాయించుకొంది. ఫోన్ నారాయణ్ కందించింది మౌనంగా.

"హలో నారాయణ్ మాట్లాడుతున్నా....ఎవరు?"

నిశ్శబ్దం....

"మీ అమ్మాయి గురించి మాట్లాడాలని."

"ఎవరు మీరు?....మా అమ్మాయి కనిపించిందా?"

"మేం ఎవరో తర్వాత తెలుస్తుంది. మా ఫోన్ నెంబర్ కనుక్కునే శ్రమ తీసుకోకండి."

"మీ రెవరు? యేం కావాలి మీకు?" అరిచాడు నారాయణ్.

"మాకేం వద్దు. మేం డబ్బులుకోసం ఫోన్ చెయ్యటం లేదు."

"మరేమిటి!"

'మీ అమ్మాయికి పెళ్ళి చెయ్యబోతున్నాం."

"వాట్ నాన్సెన్స్! పెళ్ళి చెయ్యటమేమిటి? ఏమిటీ డ్రామా?"

"అరవకండి. మాకు మెల్లగా మాట్లాడితే వినబడుతుంది. ఊరికే ఆవేశపడితే బి.పి. రైజ్ అవగలదు. మీ ఆరోగ్యాని కదంత మంచిది కాదు. మరో అర గంటలో విద్య పెళ్ళి చెయ్యబోతున్నాం."

"మీరు చెబుతుందంతా అబద్ధం. మా విద్య మీ దగ్గర లేదు."

అవతల నుండి తిరిగి నిశ్శబ్దం.

"ఎవరు మీరు? నన్నెందుకు తీసుకొచ్చారు?" విద్య కంగారుగా ప్రశ్నిస్తోంది.

"విద్యా!" అరిచాడు నారాయణ్.

"అరవొద్దని చెప్పాగా. మీ అమ్మాయి కంఠం టేప్ చేశాం. ఇప్పుడు మీరు విద్య మా దగ్గరుందని నమ్ముతా రనుకుంటున్నాం. మీరేం దిగులుపడకండి! ఎవరో గుంటూరు వారికిచ్చి అమ్మాయిని దూరంగా పంపించటం ఎందుకు? అక్కడంగా మీ కళ్ళముందుంటే సంబంధం చేస్తాం."

"ఇది అన్యాయం. నే నంగీకరించను."

"మంచిది. సంతోషం."

"ఇది అబద్ధమని చెప్పండి."

"లాభంలేదు. ఇది నిజం. టైం నోట్ చేసుకోండి. సరిగ్గా అరగంట తర్వాత మీ అమ్మాయి మెడలో మూడు ముళ్ళు పడతాయి. ప్రళయంవచ్చినా అది జరిగి తీరుతుంది."

"మా విద్య ఒప్పుకుంటాదా?"

"ఒప్పుకుంటుంది."

"మీ కెంత కావాలో అంతిస్తాను. నా బిడ్డ గొంతు కొయ్యకండి."

"మేం మీ అమ్మాయి గొంతూ, మీ గొంతూ కొయ్యటంలేదు. అదిమాత్రం నిజం."

నారాయణ్ కు యేం చేయాలో అర్థం కావటం లేదు.

"ఏమంటున్నారండి?" అంది నారాయణ్ భార్య యేడుస్తూ.

సరిగ్గా అరగంట తర్వాత....

తనను ఎదుటినుండి నిలదీస్తున్నారు.

ఎంతటి నిస్సహాయ పరిస్థితి....

"ఏమిటి మాట్లాడరు. పోలీసుల కలా ఈ విషయం

తెలియ చెయ్యాలనా? ఆ పిచ్చిపని చెయ్యకండి. మీకే ప్రమాదం. విద్య శవం చెక్కపెట్టెలో వస్తే మీరు భరించగలరా? మరో సంగతి.... ఈ పోలీసు రిపోర్టులు ఎందుకు? వెంటనే విత్ డ్రా చేసుకోండి. అరగంట తర్వాత చుట్టరికం యేర్పడుతుంటే యింకా కేసు లేమిటి?

"పెళ్ళయ్యాక యేం చేస్తారో మీకు తెలుసు.... మూడు రోజులు యిద్దరూ హనీమూన్ వెళతారు. మూడు రోజులు పూర్తయ్యాక....విద్య స్వయంగా మీ ఇంటికి వస్తుంది. అప్పటిదాకా ఉద్రేకపడి ప్రయోజనం లేదు. ఇంత జరిగాక ఆశీర్వదిస్తారని మాకు తెలుసు" అవతల చెప్పుకు పోతున్నారెవరో.

నారాయణ్ కు నిస్సత్తువ ఆవహించింది.

అతని నోటివెంట మాటలు రావటంలేదు.

అతని కరమవుతుందల్లా తన బిడ్డ భవిష్యత్ నాశనమవుతుందనే.

తన విద్య మెడలో ఉరిత్రాడు!

"మరలా వీలయితే మాట్లాడుతాం."

"ఈ పెళ్ళి ఆగదా?"

"ఆగదు."

నారాయణ్ ఫోన్ పెట్టేయబోయాడు.

"ఎందుకో తెలుసా?" వినపడింది.

"ఎందుకు?"

"మేం మీరూహించనంతదూరంలో మరో రాష్ట్రంలో ఉన్నాం కాబట్టి"

అవతల ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

ఫోన్ లో భర్త మాటల్నిబట్టి ఆమె కొంత అర్థం

చేసుకొంది.

"ఏమిటండి ఇది!"

"విద్య పెళ్ళి చేస్తున్నారట."

"ఎక్కడినుండి మాట్లాడింది?"

"ఏమో తెలియదు. ఇక్కడమాత్రం కాదు. అందుకే ఇంత సేపు మాట్లాడారు. పోలీసులు ఎంత ప్రయత్నించినా దొరకంది కూడా అందుకే."

"ఇప్పుడేమిటి చెయ్యటం?"

"ఏం చేస్తాం__భగవంతు డెవరన్నా ప్రత్యక్షం కావాలి. ఆయన మాత్రమే ఈ పెళ్ళి జరక్కుండా ఆపు చెయ్యగలడు. అది సాధ్యం అయ్యే పనికాదు."

"అమ్మాయిని యేమీ చెయ్యరు కదా?"

"ఏమీ చెయ్యరు. పెళ్ళి చేస్తారు. శోభనం చేస్తారు."

"అమ్మాయి ఎదురుతిరిగితే చంపుతారేమోనండి" అందామె యేడుస్తూ.

నారాయణ్ కు యేం చెప్పి ఓదార్చాలో తెలియ లేదు.

"మూడురోజుల తర్వాత పంపుతారట."

"అంటే అంతా జరిగాక యేమీ చెయ్యరని వాళ్ళ ఉద్దేశ్యమా?"

"అంతే కదా. పెళ్ళి జరుగుతుంది. ఫోటోలు తీస్తారు. లేకుంటే బెదిరిస్తారు అంతేగా. మూడు రోజుల తర్వాత విద్యని పంపిస్తారట. వెధవలకు ఓ విషయం తెలి యదు. అమ్మాయి రాగానే ఆ పెళ్ళిని అంగీకరిస్తా నను కుంటున్నారు. విద్య రాగానే ఎవరిలా చేశారో తెలుసు కొని వారందరినీ అరెస్టు చేయిస్తాను. ఆ ఫోటోలు....

పెళ్ళి తాలూకు గుర్తులన్నీ ధ్వంసం చేయిస్తాను. అమ్మాయికి తిరిగి పెళ్ళిచేస్తాను ఘనంగా. ఏమను కున్నారో" అన్నాడు నారాయణ్ వణుకుతూ.

నారాయణ్ భార్య దీనంగా యేడుస్తూంది.

తల్లిగా ఆమె యీ సంఘటనను భరించలేక పోతూంది.

నారాయణ్ దవడ కండరాలు బిగుసుకుంటున్నాయి.

అతను ప్రయత్నంమీద దుఃఖం ఆపుకున్నాడు.

వాచీకేసి చూసుకున్నాడు.

సరిగ్గా ఇరవై అయిదు నిముషాలు!

విద్య మెడలో తాళి కడతాడు....

ఆ తర్వాత....

ఆమె జీవితంమీదే మాయని మచ్చ!

నారాయణ్ చాలా సినిమాల్లో తీశాడు.

పెళ్ళి కాకముందే కన్నెపిల్లల శీలాన్ని బలిగొనే రేప్ దృశ్యాలు—

దారుణంగా—బాక్సాఫీస్ కోసం.

అతని కళ్ళముందు సినిమా రీళ్ళు.

అతని కళ్ళముందే జీవితం.

సినిమా జీవితం....జీవితపు సినిమా.

ఎక్కడో మంగళ వాయిద్యాల ఘోష....

వేదమంత్రాల హోరు....

వర్షించే జల్లులా కంటి నుండి రాలుతున్న కన్నీటి బొట్లు!

11

మూడు రోజులు....

ప్రతి క్షణం ఓ యుగం—

టెంక్షన్ .... సంఘర్షణ .... ఆవేదన ....
దుఃఖపు సెగలు ....
ఏదో చెయ్యాలని ఆరాటం ....
ఏమీ చెయ్యలేని అశక్తత ....
గంటలు గడుస్తున్నాయి ....
పదకొండు గంటలు!
గోడ గడియారం ధ్వనిస్తూంది.
రోడ్డుమీద కారాగిన చప్పుడు.
తలుపు తెరుచుకొని విద్య నడిచొస్తూంది.
ఆ కళ్ళలో యేదో వింత మెరుపు.
ఆ నడకలో యేదో మార్పు.

నారాయణ్ గుండెలు వేగంగా కొట్టుకొంటున్నాయి.

ఎన్నెన్నో అడగాలనుకొన్న నోరు పడిపోయింది.

విద్య నడిచివస్తూంది!

తండ్రి ముందు తల వంచుకొని యింటిలోకి వెళ్ళిపోయింది.

కళ్ళ వెంట నీళ్ళతో నారాయణ్ యాంత్రికంగా వెనక్కి తిరిగాడు.

"అమ్మా విద్యా!" కౌగలించుకొని బావురుమంది విద్య తల్లి.

ఆమె కన్నీళ్ళు విద్యను తడుపుతున్నాయి.

ఆమె యేడుపును తొక్కిపట్టి ఉంచిన కారణంగా ఒక్కసారిగా బ్రద్దలై ....

"ఏమ్మా .... యేమయింది?" అంటూ ఆగిపోయింది.

విద్య మెడలో మంగళసూత్రం!

"విద్యా .... ఆ మంగళసూత్రం తీసేయ్" అరిచాడు

నారాయణ్.

విద్య తండ్రివంక జాలిగా చూసింది.

"నాన్నా! ఇదంతా చేసిందెవరో కాదు...."

నారాయణ్ మొహంలో మారుతున్న రంగులు.

"మీ కుడిభుజం సుధాకర్."

"సు....ధా....క....రా" అన్నాడు దిగ్భ్రాంతితో.

అతని జీవితంలో మరో షాక్.

"అవును. సుధాకరే. అతని పథకం అమలు చేశారు. అతని తమ్ముడికే నన్ను కట్టారు."

"నమ్మకద్రోహం" అరిచాడు నారాయణ్.

"డాడీ! .... నమ్మకద్రోహం సినిమాలకే పరిమితమా?"

"కాదమ్మా కాదు....జీవితంలోనే వుంది" నారాయణ్ తట్టుకోలేకపోతున్నాడు.

"వాడ్ని కాల్చేస్తాను. వాడి తమ్ముడ్ని కాల్చేస్తాను. వాడికి పెరాలసిస్ వచ్చినందుకు వైద్యం చేయించినందుకు నాకు శిక్షా? ...ఛీ ...ఛీ....ఇలాంటివాళ్ళు పుట్టకూడదు, బ్రతకకూడదు" అరుస్తున్నాడు నారాయణ్.

"డాడీ! మీరు ఆవేశపడకండి. మీరు కాలుస్తానంటున్నది యెవరోన్ని కాదు. నా భర్తనే...." అంది విద్య.

"వాడు భర్తా....కాదు లోఫర్ ....ఛీటింగ్ నేరం క్రింద వాడ్ని ఎంత చేయాలో అంత చేస్తాను."

"అతను తాళి కట్టిన భర్త మాత్రమే కాదు. నన్ను అన్నివిధాలా స్వంతం చేసుకున్న మనిషి" అంది విద్య....

"అదో పీడ కల తల్లీ."

"కాదు, నా స్వంతం. ఈ నా స్వంతం వదిలిపోవటం నాకు చేతకాదు. దయచేసి క్షమించండి. నా మెడలో మూడు ముళ్ళు వేసినవాడే నా భర్త. మంచిగాని చెడుగాని అతనితోనే నా జీవితం."

"వి....ద్యా...." గుడ్లప్పగించి చూస్తూ అన్నాడు.

నారాయణ్ జీవితంలో అది 'షాక్'ల దినం.

"అవును డాడీ! సెంటిమెంట్లు కూడా సినిమాలకే పరిమితం కాదు. జీవితంలో కూడా ఉంటాయి. మీరు తీస్తున్న సినిమాల్లో ఉండటంలా? అలానే....మీరు మమ్మల్ని ఆశీర్వదించండి."

"అవును సార్, ఆశీర్వదించండి."

గుమ్మంలో సుధాకర్.

"ఇదంతా మీ అందరి కుట్ర" నారాయణ్ అరుస్తున్నాడు.

నారాయణ్ భార్య అప్పటికే ఓ నిర్ణయానికొచ్చింది. గిరుక్కున వెనక్కి తిరిగింది.

"మన అనుబంధం శాశ్వతం కావాలని ఈ సాహసం చేశాను. క్షమించండి" సుధాకర్ అంటున్నాడు.

"నా సినిమాలు చూసి ఒకరయినా సాహసాలకు పూనుకుంటే గర్విస్తా."

నారాయణ్ కు తన మాటలు గుర్తొచ్చాయి.

"విద్యా లోపలకురామ్మా" అంది తల్లి నుదుట బొట్టు పెట్టి.

నారాయణ్ దిగ్భ్రాంతి నుండి తేరుకోలేదు.

అతని కళ్ళముందే విద్య చేతిని అందుకుంటున్నాడు సుధాకర్ తమ్ముడు.

—: అయిపోయింది: —